మెట్రో కూత కూసేనా..!

పారిశ్రామికవాడకు పెరుగుతున్న డిమాండ్

● మెట్రోరైలు రాకతో తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు



జాతీయ రహదారిపై భూసార పరీక్ష చేస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు, రామచంద్రాపురం ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న మెట్రో రైలు కల త్వరలో సాకారం కానుంది. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు సేవలు పొడిగిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఈ ఏడాది మార్చిలో మెట్రోరైలు వంతెన కోసం జాతీయరహదారిపై భూసార పరీక్షలు సైతం నిర్వహించారు. ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వేర్వేరుగా అనేక మార్లు ఈ సమస్యను ప్రభుత్వం, రైల్వే అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి ప్రక్రియ వేగవంతానికి కృషి చేశారు. ఈ క్రమంలో మియాపూర్ నుంచి రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరు వరకు జాతీయరహదారిపై 13.4 కిలోమీటర్లు మెట్రోరైలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు, రామచంద్రాపురం నుంచి వేలాది మంది హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. దాంతో ఇక్కడి ప్రజలు మెట్రోరైలు కోసం అనేక ఏళ్ల నుంచి నిరీక్షిస్తున్నారు.

కారిడార్ 7లో...

రెండోదశ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కారిడార్ 7లో ముంబై జాతీయరహదారిపై మెట్రోరైలు పనులను చేపడుతున్నారు. మియాపూర్ మెట్రోరైలు స్టేషన్ నుంచి ఆల్విన్ క్రాస్‌రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్ చౌరస్తా, రామచంద్రాపురం మీదుగా పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్లు మెట్రోరైలు లైన్ వేస్తున్నారు, ఈ మార్గంలో సుమారు 10 స్టేషన్లతో ఉండే పూర్తి ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నట్లు తెలుస్తుంది.

అలంకారప్రాయంగా ఎంఎంటీఎస్

లింగంపల్లి నుంచి రామచంద్రాపురం వరకు గతంలో ఎంఎంటీఎస్ రైలును పొడిగించినప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. రామచంద్రాపురంలో ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ ఉన్నప్పటికి ఆ రైలు సరీ్వసులు లేకపోవడంతో స్థానికులు లింగంపల్లికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

మెట్రోకు మరింత డిమాండ్

ఈ ప్రాంతానికి మెట్రో రైలు రావడంతో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రజలు సకాలంలో గమ్యానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతానికి చెందిన వందలాది మంది మియాపూర్‌కు వెళ్లి మెట్రోరైలును ఆశ్రయిస్తున్నారు. దాంతో ఈ ప్రాంతంలో మెట్రోకు డిమాండ్ పెరగడంతో పాటు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ఇబ్బందులు పడుతున్నాం



నిత్యం రామచంద్రాపురం నుంచి హైదరాబాద్ నగరానికి బైక్‌పై పోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది, రాత్రి సమయంలో ట్రాఫిక్ సమస్య తప్పడంలేదు. దీంతో గమ్యానికి సకాలంలో చేరుకోలేకపోతున్నాం. మెట్రో రాకతో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణం చేయవచ్చు.

– సురేష్, ప్రైవేట్ ఉద్యోగి, రామచంద్రాపురం

మెట్రో కల నెరవేరుతుంది



ఈ ప్రాంత ప్రజలు ఎప్పటి నుంచో మెట్రోరైలు రాకకోసం ఎదురు చూస్తున్నారు. గతంలో అనేక మార్లు ఈ విషయంపై రైల్వే అధికారులను, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లా. మినీ ఇండియాగా పేరుగాంచిన పటాన్‌చెరుకు మెట్రో రావడంతో రవాణా వ్యవస్థ మరింత మెరగుపడుతోంది. మెట్రో రైలు కారణంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే

నా హయంలో రావడం ఆనందంగా ఉంది



దశాబ్ద కాలం నుంచి ఎదురుచూస్తున్న మెట్రోరైలు ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తన హయంలో త్వరలో పనులు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఎన్నికల ముందు సైతం ప్రజలుకు మెట్రో హామీ ఇచ్చాను. తాను గెలిచిన వెంటనే సంబంధిత కేంద్ర మంత్రి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మెట్రోరైలు విషయం తీసుకెళ్లాను. సంగారెడ్డి వరకు మెట్రోరైలు తీసుకెళ్లాన్నదే నా ఆశయం.

– రఘునందన్ రావు, మెదక్ ఎంపీ

క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మ ర్యాద పూర్వకంగా కలిశారు. రేవంత్‌రెడ్డి 55వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థికి రూ.25 వేలు ఆర్థిక సాయం



విద్యార్థి సంతోష్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మునిపల్లి(అందోల్): పెద్దచెల్మెడ గ్రామానికి చెందిన సంగారి సంతోష్ కుమార్‌కు అదే గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగులు రాచయ్యగౌడ్, పాండు, ఏలీయాతో పాటు మరి కొందరు రూ.25 వేలు ఆర్థిక సాయం శుక్రవారం మునిపల్లి మండలం పెద్దచల్మెడకు చెందిన సంతోష్ కుమార్ ఇటీవల బీహెచ్ఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ హోమియో పతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ)లో సీటు సాధించారు. పేదరికంతో విద్యార్థి ఉన్నత చదువులకు వెళ్లలేని పరిస్థితి. దీంతో దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేశారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు



నారాయణఖేడ్: చెకుముకి టాలెంట్ టెస్టు పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ సర్వశిక్ష అభియాన్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు పరీక్షలను నిర్వహించారు. 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 40 ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రం అందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక సలహాదారు శ్రీనివాస్ రాథోడ్ అభినందించారు. మండల స్థాయిలో ఈనెల 21, జిల్లా స్థాయిలో 28, రాష్ట్ర స్థాయిలో డిసెంబరులో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రాథోడ్, దేవిసింగ్, విజయకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్, శ్రీవిద్య, భారతి, విజయలక్ష్మి, సుశీల, సత్యనారాయణ, మారుతి, కాశీనాథ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

తప్పుడు కేసులకు భయపడేది లేదు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న తనపై సొంత గ్రామానికి చెందిన రాజకీయ నాయకులు కక్షపూరితంగా కేసులు పెట్టారని ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ రమాకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన ఈ సందర్భంగా ఆయన కాజిపల్లిలో మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా శ్రమిస్తున్న తనపై కొందరు రాజకీయ నాయకులు పనిగట్టుకొని మరి దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కాజిపల్లి సమీపంలోని జీఎంఆర్ కాలనీలో స్వచ్ఛందంగా చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగించే చర్యల్లో భాగంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. అయినా ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు.

సమగ్ర సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి అఖిలేష్రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నేటి నుంచి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు గ్రామస్తులు సహకరించి 75 అంశాలకు సంబంధించిన వివరాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి, ఎన్యుమరేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధిస్తే పారితోషకం

● సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి హామీ



విద్యార్థినుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: మండలంలోని రంజోల్ గ్రామంలో గల సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సెట్విన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు విద్యార్థినుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదువుకుని మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన వారికి ఒక్కొక్కరికి రూ.50వేల వంతున పారితోషికం అందిస్తామని ప్రకటించారు. విద్యార్థినీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన, గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ నాయకులు మంకాల్ సుభాష్, పి.నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, జమీలుద్దీన్, భీమయ్య, ప్రతాప్‌రెడ్డి, శాంతకుమార్, మల్లారెడ్డి, అక్బర్, తాహెరాబేగం, జుబేర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, ఫోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగించారు. న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులానికి చెందిన 12 మంది విద్యార్థులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. గురుకులంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంటు ఏడాది క్రితం పాడైపోగా.. ఏడాది కాలంగా మిషన్ భగీరథ పథకం నీటిని సరఫరా చేస్తుండగా పైపులైను లీకేజీతో నీరు కలుషితమవుతోందని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు వాపోతున్నారు. రెండు నెలల కిందట గురుకులాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్లాంటుకు అవసరమైన మరమ్మతులు చేయించి విద్యార్థులకు శుద్ధినీటిని అందించాలని ఆదేశించినా ఆ దిశగా చర్యలు కరువయ్యాయి.

గిరిజన గురుకులంలో చిత్రలేఖనం పోటీలు

నారాయణఖేడ్: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ శివారులోని గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆయన చిత్రాన్ని వేయడంపై పోటీలు నిర్వహించా రు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ యాదగిరి, డ్రా యింగ్ అధ్యాపకులు వెంకట్ విద్యార్థులతో చిత్రా లు వేయించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమ తు లు అందజేశారు. దిశ జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, ఎల్‌పీహెచ్ జిల్లా అధ్యక్షులు సురేష్ నాయ క్ గురుకులంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కుటుంబ సర్వేతో సత్ఫలితాలు

● జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్



వేడుకల్లో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేతో సత్ఫలితాలు లభిస్తాయని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన సీఎం జన్మదినం వేడుకల్లో ఆయన పాల్గొని, కేక్ కట్ చేశారు. తుమ్మన్‌పల్లి మాజీ ఎంపీటీసీ మహేందర్ ఉచితంగా హెల్మెట్‌లను ఎంపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలో మెరుగైన పాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంలింగారెడ్డి, ఉదయ్‌శంకర్ పాటిల్, ముల్తానీ, మక్సూద్, శంకర్ పాటిల్, వేణుగోపాల్‌రెడ్డి, మారుతీరావు పాటిల్, నవాజ్ రెడ్డి, రాజ్‌కుమార్ స్వామి, ఆశ్రఫ్అలీ, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● కలెక్టర్ క్రాంతి
● వ్యాపార కార్యాలయం ప్రారంభం



వ్యాపార కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

సంగారెడ్డి జోన్: మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్ వ్యాపార కార్యాలయాన్ని ఆమె అధికారులతో కలిసి ప్రారంభించారు. పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో శాంతి స్లమ్ సమాఖ్య పరిధిలోని మూడు స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపికైన ఏడుగురు మహిళలు కలిసి కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనలో మహిళల పాత్ర ముఖ్యమైందన్నారు. వారి సామర్థ్యాలను పెంపొందించి సొంత వ్యాపారాల్లో నిలదొక్కుకోవడం ద్వారా వారు ఆర్థికంగా ఎదగవచ్చన్నారు . కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మెప్మా పీడీ గీత, తహసీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, మెప్మా డిఎంసి,లు టిఎంసిలు , మహిళలు పాల్గొన్నారు.

అప్రమత్తమే క్యాన్సర్‌కు విరుగుడు

● జీవశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదయ్‌కుమార్



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న జీవశాస్త్ర అధ్యాపకుడు సదయ్‌కుమార్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, జీవ సాంకేతిక శాస్త్రం, జీవశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవశాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సదయ్‌కుమార్ మాట్లాడుతూ అప్రమత్తంగా ఉంటే క్యాన్సర్‌ను చెక్ పెట్టవచ్చన్నారు. జీవకణాలు నియంత్రణ కోల్పోయి అవిచ్ఛిన్నంగా విభజన చెందడాన్ని క్యాన్సర్ అంటామని, ఒకేచోట నియంత్రణ లేకుండా కణుతులు ఏర్పడితే వాటిని శస్త్ర చికిత్స ద్వారా తొలగించవచ్చని పేర్కొన్నారు. అలాకాకుండా శరీరంలో మిగతా భాగాల్లోకి వ్యాప్తి చెందుతూ ఉంటే వాటి వ్యాప్తి తీరును బట్టి వివిధ రకాలుగా పిలుస్తామన్నారు. క్యాన్సర్ అంటే భయపడాల్సిన పనిలేదని ప్రోస్టేట్, థైరాయిడ్, బ్రెస్ట్ క్యాన్సర్లు వచ్చినప్పుడు శస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చని, క్యాన్సర్ ప్రారంభ దశలో ఉంటే రేడియేషన్ థెరపీ, కెమోథెరపీ, సర్జరీ మొదలగు పద్ధతుల ద్వారా నయం చేయవచ్చన్నారు. ప్రస్తుతం మనం వాడే ఆహార పదార్థాలలో కొన్ని క్యాన్సర్ కారకాలు ఉంటాయని, వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ రత్నప్రసాద్, జీవ సాంకేతిక విభాగ అధిపతి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

జహీరాబాద్: మండలంలోని ఖాశీంపూర్ లో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 40 పాడి పశువులకు ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. చూడి నిర్ధారణ, కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా చిరాగ్‌పల్లి పశు వైద్యాధికారి అజింక్యా మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల ఆడ దూడల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్ర మంలో శాస్త్రవేత్త కైలాష్, జేవీఓ రాజయ్య, ఖాదర్, వెంకట్, ఎల్ఎస్ఏ ముబీన్, గోపాలమిత్ర భాస్కర్, అంజయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

బొల్ల శివ కుమార్ తండ్రి బి.నారాయణ, నివాసం: Q.No.3357, ODF ఎస్టేట్, ఎద్దుమైలారం గ్రామం, కంది మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ వాసినైన నేను 07-11-2024న సంగారెడ్డి సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో నా యొక్క SRO సంగారెడ్డి రిజిస్టర్ ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.3047ని/2017ను పోగొట్టుకున్నాను. ఎంత వెతికినా అది నేటివరకూ దొరక లేదు. పైన తెలిపిన ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ ఎవరికైనా దొరికితే దిగువ చిరునామాలో తెలియజే యగలరు. బొల్ల శివ కుమార్, ఫోన్: 9703335551, క్వార్టర్ నం.3357, ODF ఎస్టేట్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

● స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత



మాట్లాడుతున్న లలిత కుమారి

ఝరాసంగం(జహీరాబాద్): బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాలు రాణించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగం మోడల్ స్కూల్తోపాటు కుప్పానగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో మాట్లాడారు. బాలల హక్కులు, చట్టాలు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెల్ప్ లైన్ నంబర్లు 181, 1098 గురించి వివరించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు బాల బాలికలకు అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి అవసరం అని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, సీడీపీఓ అంజమ్మ, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూపర్‌వైజర్లు, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని అమ్మవారికి శేరి నింగన్న కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నారాయణ, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, నాయకులు చిన్నరెడ్డి, జగదీష్, నారాయణ, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా కార్తవీర్యార్జున జయంతి వేడుకలు**

సంగారెడ్డి జోన్: పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర కార్తవీర్యార్జున జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం సోమ వంశీ సమస్రార్జున క్షత్రీయ సమాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని కోలాట ప్రదర్శన, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు కోనేరు చందర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఎల్వోసీ అందజేత**

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచకు చెందిన వెంకయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. చికిత్స నిమిత్తం జహీరాబాదు ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2 లక్షలు మంజూరుకు సంబంధించి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం అందుకు సంబంధించిన ఉత్తర్వును నారాయణఖేడ్‌లో జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ తన చేతులమీదుగా అందజేశారు.

◆ **12 నుంచి ధారూర్‌లో క్రైస్తవ జాతర**

నారాయణఖేడ్: వికారాబాద్ జిల్లా ధారూరు మెథడిస్టు చర్చిలో ఈనెల 12వ తేదీ నుంచి 17 వరకు 102వ క్రైస్తవ జాతర–2024 నిర్వహించనున్నట్లు మెథడిస్టు చర్చిల జిల్లా అధికారి సంజీవరావు, పాస్టర్ జాషువా తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెథడిస్టు క్రైస్తవ జాతరని పేర్కొన్నారు. క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ **సర్వేలో పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలి**

జహీరాబాద్ టౌన్: సమగ్ర కుటుంబ సర్వే ఎరుకల కులస్తులు పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకొవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 వరకు ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టనుందని, ఇంటికి వచ్చిన సిబ్బందికి ఇంటి పేరుతో సహా ఎస్టీ ఎరుకలమని, ముఖ్యంగా కోడ్ నంబర్ 31 అని చెప్పి రాయించాలన్నారు. పూర్తి వివరాలను నమోదు చేయకుంటే అన్ని రకాలుగా నష్టపోతామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు రూ.27 వేల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఈ నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి**

సంగారెడ్డి టౌన్ : పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్ర ఎస్వీ అన్నారు. శుక్రవారం ఎమ్మెన్నార్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జాతీయ టూత్ బ్రషింగ్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రూపరాణి, యశస్విని, అఖిల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ **విగ్రహ ప్రతిష్టాపన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇశ్రితాబాద్ గ్రామంలో ఆంజనేయ, గణపతి, దత్తాత్రేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం**

జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సరీ్వసును వావిలాల జిన్నారం గ్రామస్తుల సమక్షంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ... జీడిమెట్ల డిపో అధికారులతో చర్చించి మండలంలో నూతనంగా మూడు బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు సర్వీసు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో మూడు ట్రిప్పులు సికింద్రాబాద్ జిన్నారం శివానగర్ రూట్లలో ప్రయాణిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాజీ వార్డు సభ్యులు యువజన కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు ప్రయాణికులు పాల్గొన్నారు.

◆ **హెల్మెట్ల పంపిణీ**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కేక్ కట్ చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్ ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామ సమీపంలో వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ నేత నాగరాజు ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

◆ **సర్వేను పరిశీలించిన డీపీఓ**

సంగారెడ్డి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సాయిబాబా శుక్రవారం పరిశీలించారు. చౌటకూర్ మండలంలోని కోర్పోల్ గ్రామంలో సర్వే వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

◆ **రోగులకు పండ్లు పంపిణీ**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణ మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ ఖదీర్ ఆధ్వర్యంలో కేకులు కట్ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ అబ్దుల్ ఘనీ, నాయకులు అరుణ్ గౌడ్, వాజీద్ పాల్గొన్నారు.